నత్తనడకన రోడ్డు పనులు

- నరకయాతన పడుతున్న వాహనదారులు
- నిత్యం చోటు చేసుకుంటున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



ప్రారంభ దశలోనే కల్వర్టు పనులు



కంకరవేసి వదిలేసిన దృశ్యం

ఇచ్చోడ: మండల కేంద్రంలో ప్రధాన రహదారి, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనుల కోసం రూ. 13 కోట్లు మంజూరయ్యాయి. కానీ 14 నెలలు గడచినా.. పనులు మాత్రం కొనసాగుతునే ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే రహదారి పనుల నిర్మాణంలో సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నా.. ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గతేడాది సెప్టెంబర్‌లో పనులు ప్రారంభం కాగా.. ఇప్పటికీ 30 శాతం పనులు కూడా పూర్తి కాలేదు.

ప్రయాణం నరకతనయాతన..

రోడ్డు నిర్మాణం పనుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో రెండున్నర కిలోమీటర్ల పొడవులో అక్కడక్కడ పనులు ప్రారంభించి, మధ్య మధ్యలో వదిలేశారు. దీంతో ప్రయాణం నిత్యం నరకంగా మారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుగుండా ప్రతీ నిత్యం వందలాది ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలతో పాటుగా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రోడ్డు నిర్మాణం పనుల్లో నిబంధనలు పాటించకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

పూర్తి కాని పనులు..

గత 14 నెలల కిందట ప్రారంభమైన రోడ్డు పనులు కనీసం 30 శాతం కూడా పూర్తి కాలేదు. రెండున్నర కిలో మీటర్ల పొడవు రోడ్డు, రెండు చోట్ల కల్వర్టులు, మరో మూడు చోట్ల పైపు కల్వర్టులు, మధ్యలో డివైడర్, సెంట్రలైటింగ్ నిర్మించాలి. కానీ ఇప్పటి వరకు ఆదిలాబాద్ బైపాస్ నుంచి జీసీసీ కార్యాలయం వరకు బీటీ రోడ్డు పూర్తి చేశారు. పాత బస్టాండ్ వద్ద గత నెల రోజుల కిందట ప్రారంభించిన బాక్స్ కల్వర్టు పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. శివాజీ చౌక్ వద్ద నిర్మించనున్న కల్వర్టును ఇంక ప్రారంభించనే లేదు. సిరిచెల్మ చౌరస్తాలో పైపులైన్ కల్వర్టు అసంపూర్తిగా వదిలేశారు. నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్లే ఎడమ పక్క రోడ్డుకు గ్రౌండ్ లేవల్ పనులను ప్రారంభించ లేదు.

అధికారుల పర్యవేక్షణ కరువు..

రోడ్డు పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైంది. కనీస పర్యవేక్షణ లేకుండా సంబంధిత కాంట్రాక్టర్‌తో పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ప్రజలకు అత్యవసరంగా ఉపయోగపడే రోడ్డు పనులు 14 నెలల పాటుగా కొనసాగుతున్నా.. అధికారులు అంతంగా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు వేగవంతం అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



గతేడాది నుంచి పనులు కొనసాగుతుండటంతో మండల కేంద్రానికి వచ్చిపోయే వారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– కళారి కృష్ణ, ఇచ్చోడ

ప్రమాదాలు జరుగుతున్నాయి



రోడ్డు నిర్మాణం పనులను మధ్యమధ్యలో వదిలేయడంతో తరుచూగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతీ రోజు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి ఇబ్బందులను తొలగించాలి.

– ఐద శివ, ఇచ్చోడ

మార్చివరకు పూర్తి చేస్తాం

పనుల్లో కొంత జాప్యం జరుగుతుంది. డాంబర్ ప్లాంటేషన్‌లో మరమ్మతుల కారణంగా పనులు నిలిచిపోయాయి. పనులు వేగవంతం చేసి, మార్చి వరకు రోడ్డు పనులు పూర్తి చేస్తాం.

– అరవింద్ అర్అండ్‌బీ ఏఈ

క్లుప్తంగా

అ'పూర్వ' సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2001– 2002 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకచోట చేరి సందడిగా గడిపారు. ఒకరినొకరూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పినా.. గురువులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు దావూద్, ప్రవీణ్, పోశెట్టి, యుసూఫ్, అరుణ్, నిసార్, స్వాతి, సుమలత, అన్నపూర్ణ, సుశీల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం



స్తంభం ఏర్పాటు చేయిస్తున్న చైర్మన్

ఖానాపూర్: పట్టణ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలోని ఆరోవార్డు పరిధి బర్కత్‌పురలో ఆదివారం నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయించారు. స్తంభాలు ప్రమాదకరంగా మారాయని కౌన్సిలర్ అఫ్రిన్ అమానుల్లాఖాన్, కాలనీవాసులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి స్తంభం ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోష్, కమిషనర్ మనోహర్, జన్నారపు శంకర్, పరిమి సురేశ్, షబ్బీర్‌పాషా, జావిద్, గని తదితరులు ఉన్నారు.

లైబ్రరీకి స్టడీ చైర్లు అందజేత

ఖానాపూర్: పట్టణంలోని గ్రంథాలయానికి ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన తొమ్మిది మంది ఉపాధ్యాయులు 20 స్టడీ చైర్లను లైబ్రరీకి విరాళంగా అందించారు. ఇక్కడ చదువుకుని ఉద్యోగాలు సాధించిన వారు తమ మొదటి నెల జీతం నుంచి రూ.20 వేల విలువైన స్టడీ చైర్లు అందజేసినట్లు లైబ్రెరీయన్ పృథ్వీరాజ్ తెలిపారు. చైర్లు అందించిన వారిలో షెట్పల్లి సాయి, డి.సాయికృష్ణ, లావణ్య, నవీన్, సుజాత, తిరుమలేశ్, వినయ్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వానిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఈనెల 11న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించే తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతికి హాజరు కావాలని కోరుతూ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ఆహ్వానం అందజేశారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, పర్వేజ్, నాయకులు షబ్బీర్‌పాషా, జన్నారపు శంకర్ తదితరులు ఉన్నారు.

ముస్తాబైన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ తృతీయ వార్షిక ఉత్సవాలు ఈనెల 11 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11న మూల విరాట్ విగ్రహానికి పంచామృతాభిషేకం, పతాకావిష్కరణ, గణపతిపూజ, పుణ్యాహవచనం, యజ్ఞోపవీత ధారణ, యజ్ఞశాల ప్రవేశం, తదితర పూజలతో పాటు ఆలయం నుంచి గోదావరి వరకు ఉత్సవమూర్తుల ఊరేగింపు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. 12న వేదపారాయణం, పంచామృతాభిషేకం, మండప పూజ, జయాధిహోమం, పూర్ణాహుతితోపాటు శ్రీ గోవిందమాంబ సమేత శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల కల్యాణ మహోత్సవం, కుంభాభిషేకం, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

పూలమొక్కల అందం..





ఒకప్పుడు ఇంటి చుట్టూ పెరడు ఉండేది. ప్రతీతీ ఇంట్లో విశాలమైన స్థలంలో పూల మొక్కలు చెట్లతో కళకళలాడేది. అయితే స్థలాభావం, ఇరుకైన ఇళ్లతో మొక్కలు, చెట్లకు చోటు లేకుండా పోతుంది. దీంతో పలువురు ప్రకృతి ప్రేమికులు మొక్కలతో ఉన్న అనుబంధాన్ని కొనసాగిస్తూ.. చిన్నపాటి స్థలంలో చిన్న కుండీలో మొక్కలు పెంచుతున్నారు. స్థానిక పుష్ప మొక్కల జాతులతో పాటు, విదేశీ మొక్కలను ఇంటి పరిసరాల్లో పెంచి ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

నేడు కార్తిక దీపోత్సవం

ఆదిలాబాద్: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మార్వాడీ ధర్మశాలలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి సామూహిక కార్తిక దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్య నిర్వాహణాధికారి భజరంగ్ లాల్ అగర్వాల్, బి. రమేష్ ఒక ప్రకటలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ ప్రవచనకర్త శ్రీ కృష్ణానందచే ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సామూహిక దీపోత్సవ కార్యక్రమానికి దీపాలు, వత్తులు, నూనె ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కావాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఇచ్చోడ: మండలంలో సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం 8:30 గంటలకు సిరిచెల్మలోని మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారని, 9 గంటలకు ఎల్లమ్మగూడ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి, వడ్డెరగూడ, నారాయణ్‌పూర్, నేరడిగొండ(జి) గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మౌలాన అబ్దుల్ కలామ్ అజాద్ జయంతి వేడుకలలో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

నిధుల మంజూరుకు ఎమ్మెల్సీకి వినతి

కడెం: మండలకేంద్రంలో మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆదివారం ఖానాపూర్‌లో ఎమ్మెల్సీ దండె విఠల్‌కు కడెం మండల మున్నూరుకాపు సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. మండలంలో 1200 కుటుంబాలున్నాయని.. భవన నిర్మాణం కోసం రూ.50లక్షలు కేటాయించాలని కోరారు. మండలాధ్యక్షుడు కట్ల సాగర్, ప్రధాన కార్యదర్శి దేశెట్టి శ్రీనివాస్, కోల శ్రీనివాస్, తాటి సంజీవ్, మాదాసు సత్తెన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాజీశంకర్ ఆశయ సాధన కోసం కృషి



నివాళులర్పిస్తున్న నాయకులు

తాంసి: కామ్రెడ్ దాజీశంకర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, ఆదిలాబాద్ మొదటి ఎమ్మెల్యే దాజీశంకర్ 38వ వర్ధంతిని సావర్గాంలో ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా దాజీశంకర్ స్మారక స్తూపం వద్ద పార్టీ జెండాను నాయకులతో కలిసి ఎగురవేశారు. ఆయన స్తూపం వద్ద పూలమాలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు విలాస్, సట్వాజీ, చిలుక దేవిదాస్, అరుణ్ కుమార్, సతీష్, పెద్దింటి సత్యనారాయణ, రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖత్రీ సమాజ్ భవనం ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

కైలాస్‌నగర్: మావల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఖత్రీ సమాజ్ భవనాన్ని ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖత్రి సమాజ్ కులస్తుల కృషి, పట్టుదలతో ముందుకు సాగి లక్ష్యాన్ని చేరుకుంటారని కొనియాడారు. జనాభాలో అల్పసంఖ్యాకులుగా ఉన్నప్పటికీ అందరూ ఒకే బాటలో నడుస్తు ఆదర్శంగా నిలుస్తారన్నారు. వారికి తమ వంతుగా కృషి చేస్తామని, అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు, సమాజ్ కులస్తులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ బోనాల పండుగ

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో ఆదివారం నల్లపోచమ్మ బోనాల పండుగ మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న సభ్యులు

బేల: మండలంలోని బెదోడ గ్రామంలో గల వృద్ధాశ్రమంలో ఏవన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ సీనియర్ అడ్వైజర్ పెంటపర్తి ప్రభాకర్ మాట్లాడుతూ చలికాలం దృష్ట్యా వృద్ధాశ్రమంలోని వృద్ధులు చలిని తట్టుకునేలా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పోచన్న, మేకల జితేందర్, మెస్రం శంకర్, ఉప్పల్‌వార్ కార్తీక్, షేక్ అహద్మ్, అద్దెకి సునీల్, కలగంటి భూమన్న, కలగంటి వెంకటేశ్, దుర్గ అడెల్లు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య దుర్గంధం



నార్నూర్ మండల కేంద్రంలోని మార్కెట్ ప్రాంతంలో జనావాసాల మధ్య మురుగునీరు పారుతూ.. దుర్గాంధం వస్తుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి మురికినీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– నార్నూర్

గెలిచినా.. ఓడినా ప్రజల వెంటే ఉంటా



భవనాన్ని ప్రారంభిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: రాజకీయ ప్రస్తానంలో గెలిచినా.. ఓడినా ప్రజల వెన్నంటే ఉంటానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్‌లో స్టార్ యూత్ అసోసియేషన్ భవనాన్ని ప్రారంభించారు. నూతన కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించారు. తమ ప్రభుత్వ హయాంలో ఆదిలాబాద్ పట్టణంలో అన్నివార్డుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేశామన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాసం నర్సింగ్‌రావు, అంజద్‌ఖాన్, సన ఉల్లాఖాన్, సాజిద్, ఎజాజ్, అయ్యుబ్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ తీరుతో మాదిగలకు అన్యాయం'



నియమాకపత్రం అందజేస్తున్న మల్లేశ్

కై లాసనగర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడంలో రాష్ట్రం ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష వైఖరి కారణంగా మాదిగలకు తీరని అన్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మల్లేశ్ ఆరోపించారు. ఆదివారం అదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చెర గ్రామంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ నిర్వాకంతో మాదిగ జాతి బిడ్డలకు విద్య, ఉద్యోగరంగాల్లో నష్టం జరుగుతుందన్నారు. మాదిగ ఉప కులాలన్ని ఏకతాటిపైకి వచ్చి ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరా టానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడదారపు భూమన్న, ప్రధాన కార్యదర్శిగా అలాల్ శ్రీకాంత్, ఉపాధ్యాక్షుడిగా ముక్కుల నగేశ్, కార్యదర్శులుగా అగ్గిమల్ల రాకేశ్, ప్రచార కార్యదర్శిగా కడదారపు అశోక్, సభ్యులుగా పెద్దింటి శ్రీనివాస్, అలాల్ అశోక్, పెంటపర్తి అశోక్, ప్రవీణ్, వసంత్, జస్వంత్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన గ్రామ కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

తుకుడోజి మహరాజ్ పుణ్యతిథి



కందిని సన్మానిస్తున్న కాలనీవాసులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం రాంనగర్ కాలనీలో ఆదివారం తుకుడోజి మహరాజ్ పుణ్యతిథి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం భక్తులు భజన కీర్తనల నడుమ కాలనీలోని వీధుల గుండా మహరాజ్ పల్లకి సేవ చేపట్టారు. అన్నదాన కార్యక్రమానికి కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి తన వంతు సహకారాన్ని అందించారు. సాయంత్రం కాలనీలోని రామాలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణ, రామారావు, తుకారాం, నారాయణ, నవీన్, శంకర్, అభిలాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కుటుంబ సర్వే నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని డీసీవో మోహన్ తెలిపారు. ఆదివారం మండలంలోని కొలారి, గిర్నూర్, బజార్‌హత్నూర్ గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి కుటుంబ సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇళ్లను సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు.

కాకడ్ హారతి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ముత్నూర్, ధనోర, పిప్రి, గౌరపూర్ గ్రామాల్లో కార్తీక మాసం పూజలను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉపవాస దీక్షలతో ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పూజలు ఈనెల 15 వరకు కొనసాగుతాయన్నారు. భక్తులు విశ్వనాత్ ఫడ్, మారుతి గిత్తే, ఆడావ్ సంతోష్ పటేల్, దేవిదాస్ గౌళి, సంజీవ్ లహనే, వెంకట్‌రావ్ పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీ గోడం నగేశ్

ఇచ్చోడ: మండలంలోని బోరిగామలో ఆదివారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ మాజీ పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించారు. రాజేశ్వర్ రెడ్డి తల్లి గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు తాటిపెల్లి రాజు, సోన్‌కాంబ్లే కృష్ణకుమార్, పెందుర్ తుల్సిరాం, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899